



రాజకీయ ప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్‌లో పాల్గొన్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు రుచేస్ జైవన్షీ, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

ఈవీఎంల రెండవ విడత ర్యాండమైజేషన్

నాగర్‌కర్నూల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శనివారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎదుట ఈవీఎంల రెండవ విడత ర్యాండమైజేషన్‌ను ఎన్నికల సాధారణ పరిశీలకులు రుచేస్‌జైవన్షీ, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ జరిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు కేటాయించే బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ యంత్రాల ర్యాండమైజేషన్ పూర్తి చేశారు.

ఈ ప్రక్రియ గురించి కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అభ్యర్థులకు వివరిస్తూ ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా స్క్రీన్‌పై పారదర్శకంగా చూపించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్‌లైన్ విధానం ద్వారా పారదర్శకంగా ర్యాండమైజేషన్‌కు సంబంధించిన హార్డ్‌కాపీలు, సాఫ్ట్ కాపీలు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించినట్లు తెలిపారు.

ఎన్నికల సంఘం నిబంధనలను తూచ తప్పకుడా పాటిస్తూ పూర్తి పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ ప్రక్రియను చేపడుతున్నామని రిటర్నింగ్ అధికారి, తెలిపారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా అదనపు కలెక్టర్ సీతారామారావు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.







మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి; చిత్రంలో ఎంపీ అభ్యర్థులు చల్లా వంశీచంద్‌రెడ్డి, మల్లురవి, ఎమ్మెల్యే జీఎంఆర్ ; ర్యాలీగా వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి; సీఎంకు గజమాలతో ఘన స్వాగతం

బీజేపీని.. పాతరేయాలి

- అరుణమ్మకు పేరు తెచ్చింది కాంగ్రెస్ కాదా?
- ఆమె పాలమూరు కోసం మోదీని ఏనాడైనా అడిగారా?
- వంశీచంద్‌రెడ్డిని లక్ష మెజార్టీతో గెలిపించాలి
- కొత్తకోట కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



కార్నర్ మీటింగ్‌కు వేలాదిగా హాజరైన ప్రజలు

మహబూబ్‌నగర్/ మహబూబ్‌నగర్/ కొత్తకోట, మే 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'ఈ నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పాలమూరులో బీజేపీని పాతరేయాలి. మహబూబ్‌నగర్ ఎంపీగా చల్లా వంశీచంద్‌రెడ్డిని లక్ష మెజార్టీతో గెలిపించాలి.' అని ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు ఏ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని వనపర్తి జిల్లా కొత్తకోటలో శనివారం జరిగిన కార్నర్ మీటింగ్‌లో సీఎం మాట్లాడారు. పాలమూరు పెంచుకున్న బిడ్డని తానని చెప్పారు. మారుమూల నల్లమలలో పుట్టి, వనపర్తి ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చదువుకున్నానని, తాను మీలాంటి మధ్యతరగతి వాడినేనని అన్నారు. ఒక సామాన్యుడికి ముఖ్యమంత్రి పదవి ఇచ్చిన సోనియమ్మ, కాంగ్రెస్ పార్టీ రుణం తీర్చుకునేందుకు పాలమూరు బిడ్డలంతా తనకు అండగా ఉండాలని, వంశీచంద్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు. ఢిల్లీ నుంచి మోదీ వచ్చినా, గజ్వేల్ నుంచి కేడీ వచ్చినా పాలమూరులో కాంగ్రెస్‌ను ఓడించలేరని సవాల్ విసిరారు. వారంటే తనకు శత్రువులని, కానీ ఇంటివాళ్లే పరాయివాళ్లతో కలిసి కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. డీకే అరుణమ్మ తనపై రేవంత్ పగబట్టారని చెబుతోందని, ఆమెపైన తనకెందుకు పగ ఉంటుందని అన్నారు. ఆమెకు తనకు గెట్టు పంచాయితీ కూడా లేదన్నారు. అరుణమ్మ మోదీ చేతిలో చురకత్తిలా మారి కాంగ్రెస్‌ని ఖతం చేస్తానంటున్నారని, ఎందుకు కాంగ్రెస్‌ని ఖతం చేస్తారో చెప్పాలని నిలదీశారు. ఆమెని జడ్పీటీసీగా గెలిపించినందుకా?.. గద్వాల ఎమ్మెల్యేగా, ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా చేసినందుకా, అరుణమ్మ అంటే దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చినందుకా?.. ఎందుకు కాంగ్రెస్‌ని ఖతం చేస్తారో చెప్పాలన్నారు. అరుణమ్మకు కాంగ్రెస్ ఏం అన్యాయం చేసిందని నిలదీశారు. చుట్టపు చూపులా వచ్చిపోయే మోదీని పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం ఏనాడైనా అరుణమ్మ అడిగారా?, ప్రాజెక్టులకు రిపేర్లు చేయాలన్న ఆలోచన వచ్చిందా?, ఆర్డీఎస్ పూర్తి చేసి నీళ్లిద్దామని అనుకున్నారా? అని నిలదీశారు. తనపై కేసులు పెట్టి భయపెట్టాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తానెందుకు భయపడతానని, గద్వాలలో కల్తీకల్లు దందాలు, క్రషర్ మిల్లులు, కాంట్రాక్టులు, సారా వ్యాపారాలు ఎవరివని ప్రశ్నించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ జరగాలన్నా, వాల్మీకి బోయలకు ఎస్టీ హోదా దక్కాలన్నా, పాలమూరుకు జాతీయ హోదా రావాలన్నా, ముదిరాజ్‌లు బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మారాలన్నా కేంద్రంలో వంశీచంద్‌రెడ్డి ఉండాలని, ఆయన్ని ఎంపీగా గెలిపించాలని కోరారు. ఉమ్మడి పాలమూరుకు ఏం కావాలో అన్నింటినీ చేసేందుకు ప్లానింగ్ కమిషన్ చైర్మన్ చిన్నారెడ్డి నేతృత్వంలో ప్రణాళికలు తయారు చేయిస్తున్నామన్నారు. మరోవైపున ఢిల్లీలో మనకు కావాల్సిన ప్రాజెక్టులు సాధించేందుకు అనుభవజ్ఞులు జితేందర్‌రెడ్డి ప్రత్యేక ప్రతినిధిగా కృషి చేస్తున్నారని చెప్పారు. వారిద్దరినీ సమన్వయం చేస్తూ వంశీచంద్‌రెడ్డి పాలమూరు అభివృద్ధికి దోహదపడతారని, ఆయన్ను లక్ష మెజార్టీతో గెలిపించాలని, అదేవిధంగా సీనియర్ నేత డాక్టర్ మల్లు రవిని నాగర్‌కర్నూల్ ఎంపీగా గెలిపించాలని విన్నవించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థులు చల్లా వంశీచంద్‌రెడ్డి, డాక్టర్ మల్లురవి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ ఎన్నిక: చల్లా వంశీచంద్‌రెడ్డి

ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలు పాలమూరు ఆత్మగౌరవానికి సంబంధించినవని, పాలమూరు ముద్దుబిడ్డ రేవంతన్న బలాన్ని ఢిల్లీలో చూయించే ఎన్నికలని అని అన్నారు. పాలమూరు భవిష్యత్తుకు, పాలమూరు భవిష్యత్తు తరాలకు చెందిన ఎన్నికగా అభివర్ణించారు. అందుకే ఈ ఎన్నికను కార్యకర్తలు ఆశామాషిగా తీసుకోవద్దన్నారు. ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపిస్తే మీకు సేవ చేసి రుణం తీర్చుకుంటానని అన్నారు.

పాలమూరు రంగారెడ్డి పూర్తి చేయాలి: జీఎంఆర్

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల అయినా పూర్తి చేయలేదని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని, అదే విధంగా కోయిల్‌సాగర్ ప్రాజెక్టు సామర్థ్యం పెంచాలని కోరారు. దేవరకద్ర నియోజకవర్గం నుంచి వంశీచంద్‌రెడ్డికి 30 వేల నుంచి 40 వేల ఓట్ల మెజారిటీ ఇచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు.

సీఎం సభ సక్సెస్

మహబూబ్‌నగర్/ కొత్తకోట: కొత్తకోటలో సీఎం రేవంత్‌రెడ్డి శనివారం నిర్వహించిన కార్నర్ మీటింగ్ విజయవంతం అయ్యింది. రోడ్ షోకు జనం అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దారి పొడవున బారులు తీరిన జనాలకు ముఖ్యమంత్రి అభివాదం చేశారు. సీఎంకు నాయకులు ఘన స్వాగతం పలికారు. రేవంత్ రాకకు ముందు నాలుగు గంటలకే అధిక సంఖ్యలో జనం అక్కడికి చేరుకున్నారు. దాంతో కొత్తకోట సర్కిల్ జనసంద్రంగా మారింది.

సోనియాగాంధీ రుణం తీర్చుకుందాం

- మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో మల్లు రవి

పెంట్లవెల్లి, మే 4: రాహుల్‌గాంధీని ప్రధానిని చేసి తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకుందామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 4కోట్ల ప్రజల ఆశయాలను 65 సంవత్సరాల తెలంగాణ కలను సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చి నెరవేర్చిందని పేర్కొన్నారు. ఆంధ్రాలో కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసి కూడా ఎన్నో అడ్డంకులున్నా తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని ఆయన అన్నారు. అదేవిధంగా ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహిళలకు టికెట్ లేకుండా ఉచిత ప్రయాణం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున 500రూపాయలకే సిలిండర్ అమలు కాలేదని, జూన్ 3 తర్వాత అమలు చేస్తామని వారన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించి అర్హులైన నిరుపేదలను మహిళా సంఘాలతో కలిసి ఎంపిక చేస్తామని వారితోపాటు నేను కూడా తిరిగి ఎంపిక చేస్తానన్నారు. అనంతరం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ప్రవేశపెట్టిన ఐదు గ్యారెంటీల్లో భాగంగా ప్రతీ పేద కుటుంబంలో ఒక మహిళకు లక్ష ఆర్థిక సహాయం అదేవిధంగా జాతీయ ఉపాధి హామీ కూలీలకు ప్రతిరోజు 400రూపాయలు, చదువుకున్న యువతకు లక్ష వేతనం, స్వామినాథన్ కమిషన్ మేరకు రుణమాఫీ ప్రవేశపెట్టిందని ఆయన పేర్కొన్నారు. జిల్లా బ్లాక్ కాంగ్రెస్ నాయకులు ఆకునమోని రాముయాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మదగం నరసింహాయాదవ్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కబీర్, కాంగ్రెస్ నాయకులు రామన్‌గౌడ్, ఖాజామైనోద్దీన్, ఎర్రశీను, వంగ భాస్కర్‌గౌడ్, శశి, రవి, బాలస్వామి, ఆర్.వెంకటస్వామి, కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎర్రవల్లిలో
రాహుల్, రేవంత్ సభ

- భారీ జన సమీకరణకు నాయకుల ప్రయత్నాలు



రాహుల్ సభ కోసం సిద్ధమౌతున్న వేదిక

గద్వాల, మే 4: జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నిర్వహించే ఈ సభకు భారీగా జన సమీకరణ చేసేందుకు నాయకులు ప్రణాళికలు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ సీఎం సొంత జిల్లా కావడంతో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం చర్యలు తీసుకుంటున్నారు. సభను విజయవంతం చేసేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, గద్వాల జడ్పీ చైర్‌పర్సన్ సరిత, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి కృషి చేస్తున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

సభ ఏర్పాట్లను కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ రితిరాజ్‌తో పాటు సీఆర్‌ఎఫ్ బృందం బందోబస్తు శనివారం పరిశీలించింది. సభకు ఎంతమంది వస్తారు, ఏయే నియోజకవర్గాల నుంచి వస్తారు? అనేది తెలుసుకొని బందోబస్తుపై చర్చించారు. నేషనల్ హైవే పక్కనే సభ ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పలు సూచనలు చేశారు.

నీట్‌కు సర్వం సిద్ధం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11 పరీక్ష కేంద్రాలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 4: వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్‌కు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్‌టీఏ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే ఈ పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11 కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎన్టీఏ నిబంధలు విధిగా పాటించాల్సి ఉంటుంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5:20 గంటల వరకు పరీక్ష ఉంటుంది. విద్యార్థులను కేంద్రాల్లోకి ఉదయం 11 గంటల నుంచే అనుమతిస్తారు. వారిని బయోమెట్రిక్ ద్వారా తనిఖీ చేస్తారు. నీట్ అడ్మిట్, ఆధార్ కార్డులు వెంట తెచ్చుకోవాలి. సంప్రదాయ దుస్తులనే ధరించాలి. ఉంగారాలు, చెవిపోగులు, షూ ధరించొద్దు. పెన్ను, పెన్సిల్, ఎలక్ట్రానిక్ వాచ్, వస్తువులను కేంద్రాల్లోకి అనుమతించారు.

ఉమ్మడి జిల్లాలో పరీక్ష కేంద్రాలు ఇవే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అవి మహబూబ్‌నగర్ తిరుమల హిల్స్‌లోని సమర్థ, మహబూబ్‌నగర్‌లోని మౌంట్‌బాసిల్, చైతన్య సెంట్రల్ స్కూల్స్, కేంద్రీయ విద్యాలయంలో సెంటర్లను ఏర్పాటు చేశారు. అదే విధంగా షాద్‌నగర్‌లోని ఠాగూర్, ఢిల్లీ వరల్డ్, జడ్చర్లలోని గీతాశ్రీ, స్వామి నారాయణ, శ్లోక, కడ్తాల్‌లోని ఫార్చ్యూన్ బట్టర్‌ఫ్లై, కొత్తకోటలోని కొత్తకోట పీపుల్స్ స్కూల్‌లలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశామని వేసవి దృష్ట్యా విద్యార్థులు భోజనం చేసి, పరీక్షకు రావాలని నీట్ మహబూబ్‌నగర్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీకాంత్ కోట చెప్పారు. మంచి నీటి బాటిల్ వెంట తెచ్చుకోవాలని, కేంద్రం లోకి వచ్చాక పరీక్ష ముగిసే వరకు బయటికి వదలరని తెలిపారు.

అనన్యరెడ్డికి సన్మానం



సివిల్ సర్వీసెస్ ర్యాంకు సాధించిన అనన్య రెడ్డిని సన్మానిస్తున్న ప్రతిభ కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 4 : ఇటీవల విడుదల అయిన సివిల్ సర్వీసెస్‌లో ఆల్ ఇండియా 3వ ర్యాంకు సాధించిన అనన్యరెడ్డిని శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రతిభ కళాశాల యాజమాన్యం సన్మానించింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సివిల్స్‌లో పాలమూరు విద్యార్థికి మూడవ ర్యాంకు రావడం హర్షనీయమన్నారు. ప్రతిభ కళాశాల డైరెక్టర్ వి.లక్ష్మారెడ్డి, కె. విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రసాద్, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.నర్సింహారెడ్డి, ప్రతిభ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఎస్.వెంకట్‌రామయ్య, కృష్ణయ్య, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో అనన్య తండ్రి డి.సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగదు, మద్యం పట్టివేత

నారాయణపేట/అలంపూర్‌చౌరస్తా/ఉప్పునుంతల/రాజోలి, మే 4: లోక్‌సభ ఎన్నికల కోడ్‌లో భా గంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేస్తూ అధిక మొత్తం నగదుతో వెళ్తున్న వాహనదారుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. అలాగే మద్యం పట్టుకున్నారు.

● నారాయణపేట అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం పోలీసుల తనిఖీల్లో రమేష్ అనే వ్యక్తి దగ్గర రూ. 1.60లక్షలు పట్టుకున్నారు. మార్కెట్ యార్డు నుంచి దామరగిద్దకు వెళ్తున్న రమేష్‌ను అంబేడ్కర్ చౌరస్తా దగ్గర తనిఖీ చేయగా ఎలాంటి రశీదు లేకపోవడంతో నగదును గ్రీవెన్స్ కమిటికి పోలీసులు అప్పగించారు. అలాగే జిలాల్‌పూర్ చెక్‌పోస్ట్ దగ్గర కర్ణాటక నుంచి వస్తున్న శ్రీనివాస్ అనే వ్యక్తి దగ్గర రూ.74,200, హన్మంతు అనే వ్యక్తి వద్ద రూ.51000, ఎండి మిరాన్ వద్ద రూ. 52200, మొత్తం 3,37,400 నగదు స్వాధీనం చేసుకొని గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ దృష్ట్యా రూ. 50 వేలకు మించి నగదు ఉంటే ఎలాంటి పత్రాలు, రశీదు లేకపోతే సీజ్ చేస్తామన్నారు.



నారాయణపేటలో స్వాధీనం చేసుకున్న నగదును గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తున్న పోలీసులు

● గద్వాల జిల్లా ఉండవల్లి మండల కేంద్రంలోని వైన్స్ షాపు నుంచి మద్యం అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఉండవల్లి ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. అలంపూర్ చౌరస్తాకు చెందిన సతీష్ అనే వ్యక్తి శనివారం ఉండవల్లి మీదుగా అలంపూర్ చౌరస్తా వైపు వెళ్తుండగా అనుమానం వచ్చి తనిఖీలు చేశారు. అతడి వద్ద 31.5లీటర్ల మద్యం ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. అక్రమంగా విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు తేలడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.29600లుగా నిర్ధారించారు.



రాజోలి పోలీస్ స్టేషన్‌లో నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

● ఉప్పునుంతల మండల పరిధిలోని తాడురు గ్రామంలో శనివారం ఉదయం ఎస్సై లెనిన్ తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహించారు. గ్రామానికి చెందిన జాహేద్ తన కిరాణషాపు వద్ద మద్యం అమ్ముతుండగా 20 క్వాటర్ల బ్యాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. జాహేద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

● రాజోలి శివారులోని సుంకేసు డ్యాం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో శనివారం ప్రత్యేక కేంద్ర బృందాలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వీరన్న తెలిపారు. కర్నూలు జిల్లా, మునగాల గ్రామానికి చెందిన తిరుమలేష్ అనే వ్యక్తి తెలంగాణ బార్డర్ నుంచి కర్నూలు వైపు వెళ్తుండగా తనిఖీ చేయగా రూ. లక్ష నగదు లభ్యమైంది. ఎద్దులను అమ్ముకుని వస్తున్నట్లు రైతుల తెలిపారు.

అదేవిధంగా రాజోలి చెందిన ఖలీల్ అనే వ్యక్తి నుంచి రూ. 65 వేలు నగదుతో బైక్‌పై వస్తుండగా తనిఖీలు చేయగా ఈ నగదు లభ్యమైందని, నగదును రాజోలి పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఆయన తెలిపారు.

మాడు పగులుతోంది

- వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం కేతేపల్లిలో 46.1 డిగ్రీల ఉష్ణోగ్రత

మహబూబ్‌నగర్/నారాయణపేట/గద్వాల/వనపర్తి అర్బన్/నాగర్‌కర్నూల్ టౌన్, మే 4 : సూర్య ప్రచండానికి జనం మాడు పగులుతోంది. రహదారిపైకి రావాలంటే ఎండలు దడ పుట్టిస్తున్నాయి. రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతుందే తప్పా ఎక్కడా తగ్గడం లేదు. ద్విచక్ర వాహనాలకు నెత్తిన ఎండపోటుతో పాటు కాళ్లకు కూడా రోడ్డు సెగ తగులుండటంతో నిప్పులకుంపటిలా మారుతోంది. జిల్లాలో 46 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో వడదెబ్బకు జనం విలవిల్లాడుతున్నారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం కేతేపల్లిలో శనివారం 46.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పాన్‌గల్‌లో 45.5, మదనాపూర్‌లో 45.3, గోపాల్ పేటలో 45.2, పాన్‌గల్ మండలం రేమొద్దులలో 45.0, శ్రీరంగాపూర్ 44.8, చిన్నంబావి 44.7, కొత్త కోట 44.5, వీపనగంట్ల, ఘనపూర్‌లలో 44.3, పెద్దమందడి 44.2, అమరచింత, పెబ్బేరులలో 44.0, ఆత్మకూర్‌లో 43.4, వనపర్తిలో 43.4, రేవల్లి లో 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తిలో 46.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. పెద్దకొత్తపల్లి మండలం లో 45.5, కోడేరులో 45.5, వంగూరులో 45.4, వెల్దండలో 45.0, బిజినేపల్లిలో 45.0, కొల్లాపూర్‌లో 44.8, ఉప్పునుంతలలో 44.7, అచ్చంపేటలో 44.6, చారకొండ లో 44.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లిలో 46, అలంపూర్‌లో 45.6, ఉండవెల్లిలో 45.2, ధరూర్‌లో 44.7, గద్వాల, ఇటిక్యాలలో 44.5, గట్టు లో 44.1, అయిజలో 44, మానవపాడులో 43.8, మల్దకల్‌లో 43.6, కేటీదొడ్డిలో 43.5, ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా సీసీకుంట మండలం లో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కొౌకుంట్ల మండలంలో 45.4 డిగ్రీలు, మహబూబ్‌నగర్, అడ్డాకులలో 45.3, బాలానగర్, కోయిల్‌కొండలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇక దేవరకద్ర, మహబూబ్‌నగర్ రూరల్‌లో 44.7, జడ్చర్లలో 44.4, భూత్పూర్‌లో 44.3, నవాబ్‌పేటలో 44.2, మూసా పేటలో 44.1 డిగ్రీలు నమోదుకాగా, మిగతా మండలాల్లో 43 డిగ్రీలుగా నమోదైంది. నారాయణపేట జిల్లా కోస్గి, మక్తల్, నర్వ కృష్ణలో 43డిగ్రీల ఉష్ణోగ్రతతో వడగాల్పులు వీచాయి.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్

- ఇద్దరు యువకుల దుర్మరణం

కల్వకుర్తి, మే 4 : ఆగి ఉన్న లారీని బైక ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన శనివారం నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి మండలంలో చోటుచేసుకున్నది. ఈ ఘటనకు సంబంధించి కల్వకుర్తి ఎస్‌ఐ జి.మాధవరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వంగూరు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన ఉడత వెంకటేశ్ (30), కల్వకుర్తి మండలం జిల్లెలకు చెందిన బోయ రామకృష్ణ (24)లు తుమ్మలపల్లి నుంచి జిల్లెలకు బైకుపై శనివారం బయల్దేరారు. ఈ క్రమంలో కల్వకుర్తి మండలం తాండ్ర గేటు సమీపంలో ఆగి ఉన్న లారీని బైక్ ఢీ కొట్టింది. ప్రమాదంలో వెంకటేశ్, రామకృష్ణలు అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలానికి కల్వకుర్తి ఎస్‌ఐ-2 రామచందర్‌జీ చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం కోసం కల్వకుర్తి ఆసుపత్రికి తరలించారు. వెంకటేశ్‌కు ఇద్దరు పిల్లలు భార్య జ్యోతి, రామకృష్ణ భార్య సరిత కడుపుతో ఉన్నది. వెంకటేశ్ భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



రామకృష్ణ (ఫైల్)



వెంకటేశ్ (ఫైల్)

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- హైకోర్టు న్యాయమూర్తి కె.సురేందర్

మహబూబ్‌నగర్ లీగల్/పాలమూరు, మే4 : న్యాయవాదుల సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హైకోర్టు న్యాయమూర్తి, మహబూబ్‌నగర్ జిల్లా పరిపాలన న్యాయమూర్తి కె.సురేందర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ గార్డెన్‌లో జరిగిన మహబూబ్‌నగర్ న్యాయవాదుల సంఘం వార్షికోత్సవ కార్యక్ర మానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లా నూతన కోర్టు భవన నిర్మాణానికి తనవంతు పూర్తి సహాయ సహకారాలు అంద జేస్తానన్నారు. న్యాయవాద వృత్తి ఎంతో ఉన్నతమైందని న్యాయవాదులు విధిగా వారి బాధ్యతను నిర్వర్తించాలని చెప్పారు. అంకితభావంతో పనిచేయాలని సూ చించారు. జూనియర్ న్యాయవాదులు విధిగా వారి బాధ్యతను నిర్వర్తిం చాల న్నారు. జూనియర్ న్యాయవాదుల శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే వారి పని తీరు మరింత మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా న్యాయాధి కారుల న్యాయవాదుల మధ్య మంచి సత్సంబంధాలు కొనసాగాలని చెప్పారు. హైకోర్టు న్యాయమూర్తి మాధవిదేవి మాట్లాడారు. సమావేశంలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయాధికారి పాపిరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు హను మంత్‌రెడ్డి, బార్ కౌన్సిల్ మాజీ సభ్యుడు వి.మనోహర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్‌నాథ్‌గౌడ్, నాగోజి, శ్రీరామ్‌కుమార్, ఇతర కార్యవర్గసభ్యులు, ఏపీపీలు, పీపీలు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి కె.సురేందర్

వికటించిన ఆర్ఎంపీ వైద్యం

- ప్రాణపాయ స్థితిలో చికిత్స పొందుతున్న బాధితుడు
- ఆస్పత్రిని సీజ్ చేసిన వైద్యాధికారులు


ఆసుపత్రిని సీజ్ చేసిన వైద్యాధికారులు

కృష్ణ, మే 4: ఆర్ఎంపీ డాక్టర్ చేసిన వైద్యం వికటించడంతో ఓ వ్యక్తి ప్రాణపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. నారాయణపేట జిల్లా కృష్ణ మండలం తంగడిగి గ్రామానికి చెందిన కల్లప్పగౌడ అనే వ్యక్తి గురువారం రాత్రి మూత్ర విసర్జనలో మంట వస్తుందని భార్యతో కలిసి మండల కేంద్రంలోని స్థానిక ఫస్ట్ ఎయిడ్ ఆసుపత్రికి వచ్చాడు. డాక్టర్ మెహినిద్దిన్ పరీక్షించి మూత్రాశయంలో రాళ్లు ఉన్నాయని ఆపరేషన్ చేయాలని ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకోని మూత్రనాళలో పైపు వేసి చికిత్స చేశాడు. కొద్ది సేపు అయ్యాక మూత్ర నాళం నుంచి రక్తస్రావం కావడంతో కల్లప్పగౌడ స్పృహ కోల్పోయాడు. దాంతో ఆర్ఎంపీ సూచన మేరకు కర్ణాకట రాష్ట్రం రాయచూరు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కల్లప్ప భార్య, కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. శనివారం కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్యాధికారులు మండల కేంద్రంలోని ఆసుపత్రి చేరుకొని తనిఖీలు నిర్వహించి సీజ్ చేశారు. గతంలో కూడా ఆయనపై పలు ఆరోపణలు ఉన్నాయి.

గంజాయి స్వాధీనం



గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

మహబూబ్‌నగర్, మే 4: పాలమూరులో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఖమ్మం జిల్లా ఇల్లెందు మండలం భాగ్యనగర్ తండాకు చెందిన గుగులోత్ అఖిల్(21) పాలమూరు రైల్వేస్టేషన్ దగ్గర గంజాయి ప్యాకెట్‌లు అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా పక్కా సమాచారంతో టూటౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. అతడి వద్ద 400 గ్రాముల గంజాయి ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో ప్యాకెట్‌లో 5, 10 గ్రాముల గంజాయిని పెట్టి విక్రయిస్తున్నాడు. అరెస్ట్ చేసిన రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ స్వామి తెలిపారు. నెలరోజుల క్రితం పాలమూరుకు వచ్చిన ఇతరు చిన్నచిన్న దొంగతనాలు చేస్తూ గంజాయి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో ఏరియాలో కొన్ని రోజుల పాటు ఉండి మళ్లీ స్థావరం మార్చడం అతడి అలవాటు అని చెబుతున్నారు.

‘అమరరాజా బ్యాటరీ కంపెనీ మాకొద్దు’

మహబూబ్‌నగర్‌అర్బన్, మే 4: కాలుష్యాన్ని వెదజల్లే అమరరాజా బ్యాటరీ కంపెనీ మాకొద్దని అమరరాజా వ్యతిరేక పోరాట సమితి సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో చేపడుతున్న శాంతియుత నిరసన కార్యక్రమం శనివారం 50 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దీక్షలో వెంకటేశ్, ఎం. మురళీ మాట్లాడుతూ ఆదివారం ఎంపీ ఎన్నికల బహిర్కణపై నిర్ణయం తీసుకో నున్నట్లు తెలిపారు. సాయంత్రం దీక్ష విరమణకు మహిళలు అధిక సంఖ్యలో హాజరై మద్దతు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత


నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న నర్వ పోలీసులు

నర్వ, మే 4: ఇరువై క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై కుర్మయ్య తెలిపారు, ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఉందేకోడ్ గ్రామంలోని మునెమ్మ, భర్త భీమన్న ఇంట్లో 63మూడు సంచుల బియ్యం నిల్వ ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దాంతో వారి ఇంట్లో సోదాలు చేయగా మొత్తం 20 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. వారిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిందితుడి అరెస్టు

నాగర్‌కర్నూల్ క్రైం, మే 4: భార్య గొంతుకోసి హత్య చేసిన నిందితుడు రాములును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కనకయ్య శనివారం తెలిపారు. సీఐ వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ మండలం వనపట్ల గ్రామానికి చెందిన రాములు గురువారం మద్యం మత్తులో భార్యతో గొడవ పడి ఆవేశానికి గురై పీట కొడవలితో గొంతుకోసి హత్య చేసి పరారయ్యాడు. ఈ సంఘటనపై మృతురాలి అక్క అనసూయ ఫిర్యాదు మేరకు నాగర్‌కర్నూల్ సీఐ కేసు నమోదు చేసి నిందితుడిని పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ గోవర్ధన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నల్లమల వాసి


కుంద మల్లిఖార్జున్‌ను సన్మానించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, మే 4: అమ్రాబాద్ మండలం మాధవానిపల్లి గ్రామానికి చెందిన కుంద మల్లిఖార్జున్‌ను యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డి శనివారం జడ్చర్లలో జరిగిన సమావేశంలో నియామంక పత్రం అందజేశారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన్నందున ఆయనను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ తన నివాసంలో శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ నాయకులు రాము, లక్ష్మణ్, పవన్, కృష్ణ, శేఖర్, వెంకట్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం

కోస్గిరూరల్, మే4: ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం కాగా, ఓ కోడెదూడ మృత్యువాత పడింది. ఈ ఘటన నారాయణపేట జిల్లా కోస్గి మండలం తొగాపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు గ్రామానికి చెందిన రాముకు చెందిన గుడిసె శనివారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని దగ్ధం కాగా, గుడిసెలో ఉన్న ఓ కోడెదూడ మృతి చెందింది. మరో దూడ గాయపడింది. సుమారు రూ. 1.50లక్షల ఆస్తి నష్టపోయినట్లు రైతు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

సాగునీరు పారేదెలా!

- అధ్వానంగా పంట కాలువలు
- మట్టి, చెత్తాచెదారంతో నిండిన కాలువలు
- ధ్వంసమైన తూములు
- ముంచుకొస్తున్న ఖరీఫ్ సీజన్

కొత్తకోట, మే 4 : పంట కాలువలు సక్రమంగా లేకపోవటంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. పుష్కలమైన సాగునీటి లభ్యత ఉన్నా కాలువల నిర్వహణ లేకపోవటంతో పంటలకు నీరు అందడం కష్టతరంగా మారింది. వనపర్తి జిల్లాలో సాగుకు ఆధారమైన జూరాల, రామన్‌పాడ్, భీమా ప్రాజెక్టు కాలువలు మట్టి, చెత్తాచెదారంతో నిండి ఉన్నాయి. సంవత్సరాల తరబడి మరమ్మతులు లేకపోవడంతో నీరు ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రతీ సీజన్‌లో వరికోతలు పూర్తి కాగానే రైతుల గ్రామాల వారీగా కాలువల్లో ఉన్న వ్యర్థాలను తొలగిస్తూ కాలువలను శుభ్రం చేయించేవారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో కాలువల్లో చాలా మేరకు ఒండ్రు మట్టి నిండిపోయి ఉన్నది. ఖరీఫ్ సీజన్‌కు ముందు కాలువలను ఇరిగేషన్ శాఖ అధికారులు పరిశీలించి మరమ్మతులకు బడ్జెట్ అంచనాలు సిద్ధ చేయాలి. ఒక నెల రోజులు గడిస్తే రైతులు నారుమాళ్లు పోసుకోవడానికి సన్నద్ధం అవుతారు. కానీ, కాలువల మరమ్మతులు చేపట్టిన జాడ కనబడడం లేదు. ఇలా అయితే కష్టాలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి కాలువల మరమ్మతులు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎన్నికల అనంతరం మరమ్మతులు

మరమ్మతులు చేయాల్సిన కాలువలు, తూములను గుర్తించాము. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అంచనాలు చేయలేదు. ఎన్నికలు ముగిసిన వెంటనే నివేదిక సిద్ధం చేసి మరమ్మతుల పనులు చేస్తాం.

- కిరణ్ కుమార్, డీఈ భీమా ప్రాజెక్టు


బూత్కూర్ గ్రామ శివారులో జమ్ముతో నిండిన భీమా కాలువ

శివరాత్రి జాగరణ తప్పడం లేదు



ప్రతీ సీజన్‌లో వేసుకున్న పంటలు చేతికొచ్చే సమయంలో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. కాలువల్లో మట్టి, జమ్ము నిండి పోవడంతో సాగునీరు ముందుకు రావడం లేదు. శివరాత్రి జాగరణ చేస్తూ కాలువల వెంట తిరుగితేనే నీళ్లు చెల్లోకి వస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కాలువలను మరమ్మతు చేయించాలి.

- భరత్ రైతు, బూత్కూర్


మట్టి, చెత్త, చెదారంతో నిండిన రామన్‌పాడ్ కాలువ


అప్పరాల గ్రామ సమీపంలో ధ్వంసమైన కాలువ తూము

హజ్ యాత్రికులు జాగ్రత్తలు పాటించాలి

- రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

మహబూబ్‌నగర్‌అర్బన్, మే 4: హజ్‌యాత్రలో జాగ్రత్తలు పాటించాలని, వైద్యుల సలహాలు తీసుకోవాలని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక నేషనల్ ఫంక్షన్‌హాల్‌లో వాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య శాఖ అధికారులు వైద్య పరీక్షలు నిర్వహించి వాక్సిన్ వేశారు. కార్యక్రమానికి కొత్వాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. రాష్ట్ర, దేశ ప్రజల సంక్షేమం కోసం పవిత్ర హజ్ యాత్రలో ప్రార్థించాలని యాత్రికులకు విజ్ఞప్తి చేశారు. జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు మహమూద్‌అలీ మాట్లాడుతూ మే 9 నుంచి హజ్‌యాత్రకు ప్రత్యేక విమానాలు ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా.కృష్ణ, వైద్యులు శంకర్, రఫీక్, రమేష్, సొసైటీ సభ్యులు తరపూఫ్, సభ్యులు సత్తార్, రజాక్, యూసుఫ్, అహ్మద్‌పటేల్, రజాక్, నిజాముద్దీన్, ఖలీమ్, మున, అర్షద్‌అలీ, సద్దిఖీ, హైదర్‌అలీ, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


హజ్ యాత్రికుడికి వాక్సిన్ వేస్తున్న ఒబేదుల్లా కొత్వాల్

విద్యుత్ స్తంభానికి ఢీకొన్న కారు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ఊర్కొండ, మే 4: కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొన్న సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊర్కొండపేట అభయాంజనే య స్వామి దర్శించుకొని భక్తులు తిరుగు ప్రయాణమయ్యారు. ఊర్కొండపేట-ఊర్కొండ శివారులోని మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. దాంతో విద్యుత్ స్తంభం కూలిపోవడంతో పాటు కారు దెబ్బతిన్నది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై వీరబాబు తెలిపారు.

ఖేలో ఇండియాకు క్రీడాకారుడి ఎంపిక


మిర్జా మహ్మద్‌బేగ్

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, మే 4 : మహబూబ్‌నగర్ జిల్లాలోని రాజాపూర్‌కు చెందిన వాలీబాల్ క్రీడాకారుడు మిర్జా మహ్మద్‌బేగ్ ఖేలో ఇండియాకు ఎంపికైయ్యాడు. మూడేళ్ల నుంచి వాలీబాల్‌లో విశేషంగా రాణిస్తున్న మహ్మద్ బేగ్ త్రివేండ్రంలోని శాయ్ హాస్టల్‌లో వాలీబాల్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. గత ఏడాది ఢిల్లీ జరిగిన సబ్ జూనియర్ నేషనల్స్, అదే ఏడాదిలో ఢిల్లీ జరిగిన జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19,ఈ ఏడాది గుజరాత్‌లో జరిగిన జాతీయస్థాయి అండర్-ఎస్‌జీ ఎఫ్ టోర్నీ రాష్ట్ర జట్టు తరుపున ఆడి ప్రతిభ చాటి ఖేలో ఇండియా పథకానికి ఎంపికైయ్యాడు. ఎల్ఎన్‌సీఈపీ త్రివేండ్రంలోని నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్స్ లేన్సీ(ఎన్‌సీఓఈ) సెంటర్‌కు ఎంపికైయ్యాడు. ఈ సెంటర్‌లో మహ్మద్‌బేగ్ ప్రత్యేక శిక్షణ పొందనున్నాడు.

రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

- పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి
- తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల



నారాయణపేటలో కరపత్రాలు విడుదల చేస్తున్న పాలమూరు అధ్యయన, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు

మక్తల్/నారాయణపేటటౌన్, మే 4 : రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుదామని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి అన్నారు. శనివారం మక్తల్ పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో, నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశాన్ని అప్పగించే కుట్రలు చేస్తుందన్నారు. అంతే కాకుండా దేశంలోని సంపద మొత్తం సంపన్నులకు అప్పగించే ప్రయత్నం చేస్తుందన్నారు. ఆదివాసీలు, ముస్లింలు, దళితులపట్ల శత్రువైఖరి అవలంభిస్తున్నారని విమర్శించారు. లౌకిక వాదమే రాజ్యాంగానికి ఆత్మ అని ఆనాడు అంబేడ్కర్ అంటే నేడు లౌకిక వాదం అనే పదాన్ని రాజ్యాంగం నుంచి తొలగించేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. దేశ వనరులు కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం, ఆదివాసీల అణచివేత, ప్రతిపక్ష పార్టీలపై ఈడీ, సీబీఐ దాడులకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. అధికారాన్ని సంపన్న, కార్పొరేట్ వర్గాల కోసం ఉపయోగిస్తున్నారన్నారు. ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించకుండా పదేళ్ల పాటు పాలన సాగించిన బీజేపీ కేంద్రంలో మరోసారి అధికారం ఎలా చేపట్టగలదని, రాజ్యాంగ హక్కుల విలువల రక్షణ లక్ష్యంగా ప్రశ్నిద్దామన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న ప్రభుత్వాలను ఓటుతో నిలదీయాలన్నారు. సమావేశంలో తెలంగాణ పీపుల్స్ యాక్షన్ కమిటీ నాయకులు డి. చంద్రశేఖర్, సాతూరు యాదయ్య, సత్యనారాయణ, శనిగారం సత్యం, ముత్తయ్య, చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీదేవి, రాములు, లింగన్న, నర్సింగప్ప, కమ్మరి నారాయణ, విజయ్ కుమార్, పృథ్విరాజ్‌లు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం- కేసు నమోదు

ఊర్కొండ, మే 4: మహిళ అదృశ్యం అయిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. శనివారం ఎస్సై వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో ఓ గ్రామానికి చెందిన వివాహిత శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలతో పాటు బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో మహిళ భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

గద్వాల క్రైం, మే 4 : ఈతకు వెళ్లిన యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన శనివారం గద్వాల జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన రంగస్వామి(23) అనే యువకుడు శనివారం జిల్లా కేంద్రంలోని లింగంబావిలో ఈతకు వెళ్లాడు. అయితే బావిలో ఈత కొడుతుండగా నుదిటిపై బలమైన గాయమైంది. ఈ క్రమంలో నీటిలో మునిగిపోయాడు. ఈ విషయంపై బావిలో ఉన్న కొందరు మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకవెళ్లగా వెంటనే సిబ్బందితో బయటకు తీయించారు. కానీ రంగస్వామి అప్పటికే మృతి చెందాడు. ఈ విషయంపై పట్టణ ఎస్ఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

విద్యుదాఘాతానికి గురై ..

మాగనూరు: విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నారాయణపేట జిల్లా మాగనూరు మండలం మందిపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన అబ్దుల్ పాషా (35) నూతన గృహ నిర్మాణ పనుల్లో భాగంగా గోడలకు క్యూరింగ్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామంలోని వివిధ పార్టీల నాయకులు, స్థానికులు కోరారు.

చికిత్స పొందుతూ..

రాజోలి : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెం దాడు. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండలంలోని పచ్చర్ల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాలు ప్రకా రం.. గ్రామానికి చెందిన అల్లావుద్దీన్ (50) కూలీ పని చేసుకుంటూ జీవించేవాడు. తాగుడుకు బానిస అయ్యా డు. ఇటీవల బంధువుల పెళ్లికి వెళ్లినచోట కూడా తాగి రా వడంతో భార్య తిట్టింది. దాంతో మనస్తాపం చెందిన అల్లావుద్దీన్ శనివారం తన కుటుంబ సభ్యులను ఇంట్లో పెట్టి బయట చిలుకు పెట్టి కుటుంబ సభ్యులు చూస్తుండగానే క్రిమిసంహారక మందు తెచ్చుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు కలిసి చికిత్స నిమిత్తం అయిజ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి గద్వాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. భార్య ననబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.


కోయిలకొండలో మూతపడిన పెట్రోల్ బంక్‌లు

- ఒకేసారి రెండు బంక్‌ల మూసివేత
- తీవ్ర ఇబ్బందుల్లో వాహనదారులు, రైతులు

కోయిలకొండ మే 4 : మండల కేంద్రంలోని పాలమూరు రోడ్డుపై ఉన్న రెండు పెట్రోల్‌బంక్‌లు ఒకేసారి మూతపడడంతో వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 25 రోజులుగా మండల కేంద్రంలో ఉన్న హెచ్‌పీ, ఇండియన్ పెట్రోల్‌బంక్‌లు మూసివేశారు. దీంతో వాహనదారులు బ్లాక్ లో ఎక్కువ ధరకు డీజిల్, పెట్రోల్‌లు కొనుగోలు చేస్తున్నారు. ప్రతీ సారి తరచూ పెట్రోల్ బంక్ మూత పడడంతో వివిధ గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు వరికోతలు, చెరువుల్లో ఒండ్రుమట్టి తరలించడం పనులు కొనసాగుతుండగా పెట్రోల్ బంక్ మూతతో జిల్లా కేంద్రానికి వెళ్లి డీజిల్ తెచ్చుకోవల్సిన పరిస్థితి దాపురించిందని వాహనాల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్దూరు, కొటకొండ ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాదారులు బంక్‌లు మూతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బంక్‌లు లీజుకు ఇచ్చే విషయంతో సమస్యలు వచ్చి మూతపడినట్లు బంక్ నిర్వహకులు తెలిపారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పెట్రోల్‌బంక్‌లు తెరిపించాలని వాహనదారులు కోరుతున్నారు.


కోయిలకొండలో మూసివేసిన బంక్ ముందు బ్లాక్‌లో బాటిళ్ల ద్వారా అమ్ముతున్న పెట్రోల్, డీజిల్

ట్రాక్టర్ ఆపుకొన్నాం



కోయిలకొండలో ఉన్న పెట్రోల్ బంక్‌లు తరుచూ మూతపడుతుండడంతో ట్రాక్టర్లకు డీజిల్ కోసం ఇబ్బంది పడుతున్నాం. పని వచ్చిన డీజిల్ లేక ట్రాక్టర్లు అపుకొనే పరిస్థితి ఏర్పడింది. అధికారులు పట్టించుకొని పెట్రోల్ బంక్‌లు తెరిపించాలి.

-విజయ్, ట్రాక్టర్ డ్రైవర్, కోయిలకొండ

డీజిల్‌కు ఇబ్బంది పడుతున్నాం



వేసవికాలం పని ఉన్నప్పుడే పెట్రోల్ బంక్ మూతతో డిజిల్ కోసం ఇబ్బంది పడుతున్నాం. మండలంలో పెట్రోల్ బంక్‌లు పెట్టుకొని అవస్థ పడే పరిస్థితి నెలకొంది. డిజిల్ కోసం జిల్లా కేంద్రానికి వెళ్లి తెచ్చుకొంటున్నాము. అధికారులు స్పందించి కోయిలకొండలో పెట్రోల్ బంక్‌లు తెరిపించాలి.

- వెంకట్రాములు, కోయిలకొండ

చర్యలు తీసుకుంటాం

కోయిలకొండలో రెండు బంక్‌లు ఎందుకు మూసివేశారన్న విషయం తెలియదు. పెట్రోల్ బంక్‌ల మూతపై విచారణ జరిపిస్తాం. వెంటనే పెట్రోల్ బంక్‌లు తెరిపించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

- బాలరాజ్, డీఎస్‌వో, మహబూబ్‌నగర్

జీహెచ్‌ఎం సైదులు సేవలు చిరస్మరణీయం


జీహెచ్‌ఎం సైదులు దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న శిష్య బృందం

అచ్చంపేట, మే 4: నల్లమల ప్రాంతంలో ఎంతోమందికి హిందీలో శిక్షణ ఇచ్చి ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దారని జీహెచ్‌ఎం సైదులును ఆయన శిష్య బృందం కొ నియాడారు. శనివారం ఆయన దశదిన కర్మ కార్యక్రమంలో వారు పాల్గొని హైవి ధంగా స్పందించారు. అచ్చంపేట పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల అన్న పూర్ణ ఫంక్షన్‌హాల్‌లో దశదిన కర్మ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, మేధావులు, విద్యార్థులు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అచ్చంపేట ప్రాంతంలోని వివిధ పాఠశాలల్లో పనిచేసి విద్యార్థులకు శిక్షణ అందించడంతో పాటు హిందీ మక్కువ ఉన్న విద్యార్థులను ఆ కోర్సులలో మంచి ఫలితాలకు కృషి చేశారన్నారు. శిష్య బృందంలో సాజిద్, రూప్లానాయక్, బసవ య్య, శ్రీనివాసులు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

'ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించాలి'

తాడూరు, మే 4 : ఇండియా కూటమి అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.పర్వతాలు అన్నారు. తాడూరు మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించాలని బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వి.పర్వతాలు మాట్లాడుతూ మతతత్వ బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ఓడించి ఇండియా కూటమి అభ్యర్థి మల్లురవిని గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పదేళ్ల మోదీ పాలన ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. బీజేపీ నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలని ఆయన అన్నారు. ఇండియా కూటమి బలపర్చిన అభ్యర్థి మల్లురవి గెలుపు కోసం సీపీఎం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి అంతటి కాశన్న, బలరాజు, కే.కాశన్న, మధు, రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కాంగ్రెస్‌తోనే సాధ్యం

పెద్దకొత్తపల్లి, మే 4 : పేదలకు సంక్షేమ పథకాలు కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని పెద్దకొత్తపల్లి మాజీ సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం పెద్దకొత్తపల్లిలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన 11గ్యారెంటీలను ఇంటింటికి తిరిగి ఓటర్లకు వివరించారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవికి అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

● బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దాసరి బుచ్చిరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దండునరసింహులు కాంగ్రెస్ కండువా కప్పి సాదారంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తగిలి కృష్ణయ్య, నాయకులు అశోక్‌రెడ్డి, దబ్బ ఎల్లయ్య, దండు చంద్రయ్య, తగిలి బాలస్వామి, శివశంకర్, మహేష్, శ్రీనివాస్‌రెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు కల్వకుర్తికి అన్నమలై రాక

- నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు


అన్నమలై రాక కోసం ఏర్పాట్లను పరిశీలిస్తున్న తల్లోజు ఆచారి

కల్వకుర్తి, మే 4 : తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నమలై సోమవారం సాయంత్రం కల్వకుర్తికి రానున్నట్లు నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు తెలిపారు. కల్వకుర్తి పట్టణంలో సోమవారం సాయంత్రం బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా నిర్వహించే బీజేపీ ప్రచారం, రోడ్‌షోకు ముఖ్య అతిథిగా అన్నమలై హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. బీజేపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని ఎంపీ పోతుగంటి రాములు కోరారు.

● ఏర్పాట్లను పరిశీలించిన తల్లోజు ఆచారి

కల్వకుర్తి పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద నిర్వహించే తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నమలై రోడ్‌షో, సభ ఏర్పాట్లను స్థానిక నాయకులతో కలిసి జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి జక్కారఘునందన్‌రెడ్డిలు శనివారం పరిశీలించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేంద్రగౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరసింహ, నాయకులు అభిలాష్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, నరేష్‌గౌడ్, పుట్ట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సుభిక్షం కోసం ప్రార్థించాలి

- హజ్ యాత్రికులకు టీకాలు

నాగర్‌కర్నూల్ టౌన్, మే 4: ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే హజ్ యాత్రలో యాత్రికులు నాగర్‌కర్నూల్ ప్రజల సుభిక్షం కోసం ప్రార్థించాలని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రూబీ గార్డెన్‌లో జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఫరీద్ అహ్మద్ ఆధ్వర్యంలో హజ్ యాత్రికులకు టీకా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి హాజరై యాత్రికులకు టీకా వేసి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హజ్ యాత్రికులు నిష్ఠతో అక్కడికి చేరుకుని యాత్ర పూర్తి చేసుకుని క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. హజ్ యాత్రికులు యాత్ర పూర్తయ్యే వరకు నిష్ఠతో ఆధ్యాత్మిక చింతనతో మెలగాలని మహబూబ్‌నగర్ జామియా నిజామియాకు చెందిన ఆలీమ్ ముఫ్తి మహమ్మద్ హఫీజ్ ఫైజుద్దీన్ అన్నారు. హజ్ సొసైటీ బాధ్యులు మహమ్మద్ ఇబ్రహీం, మహ్మద్ అబ్దుల్ హక్, శుకూర్, అమీర్ పాషా, నూరుల్ హక్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హబీబ్ ఉర్ రెహమాన్, కౌన్సిలర్లు నిజాముద్దీన్, కావలి శ్రీనివాసులు, మత పెద్దలు మహ్మద్ సాదిక్ పాషా, యాకూబ్ బాబాజీర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

తెలకపల్లి, మే 4 : బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థికి మద్దతుగా మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శనివారం తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రామన్న మాదిగ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతుడైన డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాల్సిన బాధ్యత మనపైన ఉందని ప్రజలకు తెలియజేశారు. తెలంగాణ దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్మూరి రాములుమాదిగ, తెలంగాణ దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొన్నిమాదిగ, తెలంగాణ దండోరా దర్శనాల సాయికుమార్‌మాదిగ, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లపాగ జానుమాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి భీమయ్యమాదిగ, కొల్లాపూర్ తాలుకా అధ్యక్షుడు బొల్లి రాజగోపాల్ మాదిగ, కొల్లాపూర్ మండల అధ్యక్షుడు పుట్టపాక మధుమాదిగ పాల్గొన్నారు.

ఫారెస్టు భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- డీఎఫ్‌వో రోహిత్‌గోపిడీ

కొల్లాపూర్, మే 4 : అటవీశాఖ పరిధిలో ఉన్న భూములను ఆక్రమిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని, ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని డీఎఫ్‌వో రోహిత్‌గోపిడీ హెచ్చరించారు. కొల్లాపూర్ మండల పరిధిలోని ముక్కిడిగుండం, గేమ్యానాయక్‌తండా నల్లమల పరిసరాల్లో శనివారం డీఎఫ్‌వో రోహిత్‌గోపిడీ ఆకస్మిక పర్యటన చేశారు. ఫారెస్టు భూములను ఆక్రమిస్తున్న ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారెస్టు భూములను ఆక్రమిస్తున్న వారిపై శాఖపరమైన కేసులు నమోదు చేసి భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని రేంజర్ శరత్‌చంద్రారెడ్డిని ఆదేశించారు. అటవీ భూమి హక్కు పత్రాల కోసం కొత్తగా ఇటీవలే ఎవరైనా అటవీ భూములను స్వాధీనం చేసుకుంటే వారికి హక్కు పత్రాలు రావని నిబంధనల ప్రకారమే అర్హులైన లబ్ధిదారులకే ప్రభుత్వం పట్టాలు అందజేస్తుందని నిబంధనలకు విరుద్ధంగా అటవీ భూములను స్వాధీనం చేసుకోవాలని చూస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. నల్లమలలో నిఘా పెంచాలని భూములు స్వాధీనం చేసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రేంజర్ శరత్‌చంద్రారెడ్డిని ఆదేశించారు.

ఎన్నికల కోడ్ ముగియగానే అన్ని పథకాలు అమలు

-ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి


తాడూరు మండలంలోని ఇంద్రకల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

తాడూరు, మే 4 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలకుగాను ఐదింటిని అమలు చేయగా ప్రస్తుతం మన జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నాలుగు గ్యారెంటీలు అమలు కావడం లేదని మరికొద్ది రోజుల్లో అమలు చేసి తీరుతామని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఇంద్రకల్ గ్రామంలో తాడూరు మండలంలోని 24 గ్రామపంచాయతీలకు సంబంధించి ముఖ్య కార్యకర్తల మండల స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి , కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి కుమార్తె శ్రుతిలు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ఆగస్టు 15లోగా రైతులందరికీ రుణమాఫీ చేసి తీరుతామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ న్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయిలో ప్రతీ కార్యకర్త మల్లురవి గెలుపు కోసం అహర్నిషలు కృషి చేయాలని కోరారు. ఎలాగైతే ఎమ్మెల్యేను గెలిపించుకున్నామో అదేవిధంగా ఎంపీ అభ్యర్థిని గెలిపించుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహుమతి ఇవ్వాల్సిందిగా కార్యకర్తలను కోరారు. జడ్పీటీసీ సభ్యురాలు మందడి రోహిణి, సుమిత్ర, పార్టీ మండల నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కొత్తపల్లి వెంకటయ్య, వల్లపురెడ్డి, నరేందర్‌రెడ్డి, చెన్నపురెడ్డి, మల్లయ్య, రమేష్, వినోద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తాడూరు మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నయ్య తల్లి అయిన అనారోగ్యంతో నారమ్మ మేడిపూర్‌లో అనారోగ్యంతో జంగమ్మల మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి శనివారం మృతురాల కుటుంబాలను పరామర్శించారు.

మూడోసారి ప్రధానిగా నరేంద్రమోదీని చూడాలి

- బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్


తాడూరులో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్

తెలకపల్లి, మే 4 : మూడవసారి దేశ ప్రధానమంత్రిగా నరేంద్రమోదీని చూడాలని నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ అన్నారు. ఎంపీ ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా తెలకపల్లి మండల కేంద్రంలో పెద్ద ఎత్తున మహిళలు, కార్యకర్తలతో కలిసి గ్రామ పుర వీధుల గుండా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. అనంతరం బస్టాండ్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ మరోసారి ప్రధానమంత్రి కావాలని ఆయన న్నారు. ఎంపీగా తనను గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని ప్రజల వాణిని పార్లమెంట్‌లో విన్పిస్తానని అన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు రమణారెడ్డి, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జాకీర్‌హుసేన్, జిల్లా అధికార ప్రతినిధి కొత్తపలి రవికుమార్‌రెడ్డి, బాబుసాగర్, కే.రమేష్, లక్ష్మణ్, రవి పాల్గొన్నారు.

భారతదేశ రక్షణకే మోదీయే శ్రీరామ రక్ష

తాడూరు: గత ప్రభుత్వాల పని తీరుతో పోల్చినట్లయితే ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు దేశానికి అన్ని వేళలా అండగా ఉండే ఏకైక వ్యక్తి భారత ప్రధాని నరేంద్రమోదీయేనని బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ అన్నారు. ప్రస్తుత దేశ రక్షణ కోసం మోదీయే భారతావనికి శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ పార్టీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. తాడూరులో ర్యాలీ నిర్వహించి కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు దిలీపాచారి, మండల అధ్యక్షులు లోహిత్‌రెడ్డి, పార్లమెంట్ పరిధిలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఆగస్టు 15 లోపు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తాం

● ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

చారకొండ, మే 4: ఆగస్టు 15 లోపు రైతులకు ఒకేసారి రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా శనివారం మండలంలోని చారకొండ, మర్రిపల్లి, శాంతిగుడెం, తిమ్మాయిపల్లి, రామచంద్రాపురం, సిర్సనగండ్ల, గైరాన్‌తండా, వంకరాయితండా, అగ్రహారంతండా, బోడబండతండా తదితర గ్రామాల్లో జడ్పీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మోపతయ్య, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ శ్రేణులు డప్పులతో వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిరిగానే కేంద్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు ప్రజలను ఓటు అడిగే హక్కుల లేదని రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేశామని మేము పాలకులం కాదు ప్రజా సేవకులం అని అన్నారు. ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థి ఎంపీ మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పార్టీ కార్యకర్తలు ఎంపీ అభ్యర్థి మల్లురవి గెలుపుకోసం సైనికుల్లా పనిచేయాలని అన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు భీముడునాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో మండలంలోని తిమ్మాయిపల్లి మాజీ సర్పంచ్ నాయిని తిరుమలేష్ కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి మహేందర్, అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు జమ్మికింది బాల్ రాంగౌడ్, ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ గ్యార లక్ష్మయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు పానుగంటి అంజయ్య, అనిశెలట్టి నాగేంద్ర, మండల యూత్ ప్రెసిడెంట్ గణేష్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ జగన్‌మోహన్, జేసీబీ వెంకటయ్యగౌడ్, శ్రీపతిరావు, జైపాల్, రాంరెడ్డి, సందీప్‌రెడ్డి, గుండె శివగౌడ్, గజ్జే కొండలయ్యగౌడ్, నర్సింహారెడ్డి, ముత్యాలమ్మ, వెంకటయ్య ప్రశాంత్‌నాయక్, సత్తార్, హన్నంతునాయక్, నూనే విష్ణు తదితరులు పాల్గొన్నారు.

● జూపల్లిలో...

మండలంలోని జూపల్లిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్య, జిల్లా నాయకులు ముస్తఫముజ్జుబాయిలతో కలిసి జడ్పీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ ప్రచారాన్ని నిర్వహించారు. మల్లు రవికి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రాంచెంద్రి, మల్లయ్య, వెంకటయ్య, లింగయ్య, మల్లికార్జున్, సిరాజ్, జమ్ముల శ్రీకాంత్, రామస్వామి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

రొట్టెలు చేసి.. బజ్జీలు వేసి..

- మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రచారం


బజ్జీలు వేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, మే 4 : నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని శనివారం రాత్రి కొల్లాపూర్ పట్టణంలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాపారస్తులను కోరారు. శనివారం రాత్రి పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా పర్యటించి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవికి ఓటు వేయాలని మంత్రి అభ్యర్థించారు.

ప్రచారంలో భాగంగా ఆర్డీవో కార్యాలయ సమీపంలో రొట్టెలు చేసి, బజ్జీలు వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని, ఎంపీ ఎన్నికల తర్వాత అర్హులైన ప్రతీ ఒక్కరికి రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తామని మంత్రి తెలిపారు.

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి


ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, మే 4 : రాష్ట్రంలో సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి కాంక్షించే కాంగ్రెస్‌ను బలపర్చి నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కల్వకుర్తి మండల పరిధిలోని జీడిపల్లి గ్రామంలో శనివారం రాత్రి మల్లురవికి మద్దతుగా ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను ఓటు అభ్యర్థించారు. జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, నాయకులు బృంగి ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

హోం ఓటింగ్ నిర్వహించిన అధికారులు


ఓటును వినియోగించుకొంటున్న వృద్ధురాలు

చారకొండ, మే 4: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అచ్చంపేట, కల్వకుర్తి నియోజక వర్గాల్లోని చారకొండ మండలంలో శనివారం ఎన్నికల అధికారులు వృద్ధులకు, వికలాంగులకు హోం ఓటింగును నిర్వహించారు. వీడియో గ్రాఫర్, పోలీస్ సిబ్బందితో కలిసి మైక్రో అబ్జర్వర్, ఎన్నికల అధికారులు చారకొండలో ఒకరు, జూపల్లిలో ఇద్దరు, చంద్రా యన్‌పల్లిలో ఒకరు, శేరిఅప్పారెడ్డిపల్లి పరిధిలోని తండాలో ఒకరు.. మొత్తం ఐదుగురు హోం ఓటింగ్‌ను వినియోగించుకున్నారని అధికారులు తెలిపారు. అధికారులు శంకర్ నాయక్, మంజుల, మహమ్మద్ నబి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

అచ్చంపేటటౌన్ మే 4: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్పీ ప్రవీణ్‌కుమార్ మద్దతుగా శనివారం అచ్చంపేట పట్టణంలోని 19వ వార్డులో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆయన వెంట మునిసిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, కౌన్సిలర్లు రమేస్, శ్రీను, బాలరాజు, శ్రీనివాస్‌గౌడ్, అశోక్, నాగరాజు, మల్లేష్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఊర్కొండ, మే 4: తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మాధారం గ్రామంలో ఆయన మహబూబ్ నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీచంద్ రెడ్డి గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవుతున్నారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు అమలు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డికి మద్దతుగా ఎంపీ అభ్యర్థి వంశీచంద్ రెడ్డి గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

కల్వకుర్తి, మే 4 : పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్‌ఐ మాధవరెడ్డిలు కోరారు. కల్వకుర్తి మండలంలోని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సీఐ నాగార్జున, ఎస్‌ఐ మాధవరెడ్డిలు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు తీసుకుబోయే చర్యలను సమీక్షించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

'కేంద్ర పథకాలను గడప గడపకు తీసుకెళ్లాలి'

అమ్రాబాద్, మే 4: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలను గడపగడపకు కార్యకర్తలు తీసుకుపోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి నాగరాజు పిలుపునిచ్చారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించటం ముమ్మాటికి ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శనివారం అమ్రాబాద్, పదర మండల కేంద్రాల్లో వేరువేరుగా నిర్వహించిన ఆ పార్టీ కార్యవర్గ సమావేశాలకు అచ్చంపేట ప్రబారి జగదీశ్వర్ రెడ్డి తో కలిసి నాగరాజు పాల్గొన్నారు. బీజేపీ మండలాల అధ్యక్షులు గోలి రాజు, కొయ్యల మల్లేష్, రమోజీ, శ్రీనివాసు, నీలం రవి, రమేష్, చంద్రయ్య యాదవ్, రాము తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌రిబ్బన్ క్లబ్‌ను ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపాల్

బల్మూరు, మే 4 : శ్రీఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొండనాగుల కళాశాల ప్రాంగణంలో రెడ్‌రిబ్బన్ క్లబ్‌ను శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.రామచంద్రం ప్రారంభించారు. తర్వాత కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు ప్రాధాన్యతను దాని గురించి పూర్తిగా అవగాహన కల్పించారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్లు రవి పరంగి, డాక్టర్ దూప్‌సింగ్, అధ్యాపకులు డాక్టర్ కృష్ణగోపాల్, డాక్టర్ ఈశ్వర్‌లాల్, వెంకటస్వామి, ముంతాజ్‌బేగం, గోపాల్, గాయత్రి, లలిత, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

నాగర్‌కర్నూల్ టౌన్, మే 4: విశ్రాంత ఉద్యోగుల సమ స్యలు పరిష్కరించేందుకు సంఘం ఎల్లప్పుడు కృషి చే స్తుందని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జె.రాంచంద్రారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా దాదాపు 4 వేల మంది వి శ్రాంత ఉద్యోగులు సంఘంలో సభ్యత్వం కలిగి ఉన్నారని పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అచ్చంపేట అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, బిజినేపల్లి అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, కల్వకుర్తి అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కొల్లాపూర్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పాలెం అధ్యక్షులు శారదమ్మ, నాగర్‌కర్నూల్ అధ్యక్షుడు బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

- డీఆర్‌డీఏ పీడీ చిన్న ఓబులేషు


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ చిన్న ఓబులేషు

పెద్దకొత్తపల్లి, మే 4 : గ్రామాల్లో పనులు జరిగే చోట ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ చిన్న ఓబులేషు శనివారం మండల పరిధిలోని చంద్రకల్, ఆవిరాల, పెద్దకొత్తపల్లి గ్రామాల్లో ఉపాధి పనులు జరిగే ప్రదేశాన్ని సందర్శించి పనులను పరిశీలించారు. ఉపాధి కూలీలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ఎండలు మెండుగా ఉండడంతో కూలీలు ఉదయాన్నే 7గంటలకు పనులకు వచ్చి 11 గంటలలోపు ఇంటికి తిరిగి వెళ్లాలని ఆయన సూచించారు. గ్రామాల్లో కూలీల సంఖ్య పెంచాలని ఆయన అన్నారు. గ్రామ సెక్రటరీ నాగళశి, ఏపీవో మంజుల, ఈసీ రామ్మోహన్‌రెడ్డి, టీఏలు మణిరాం, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

కల్వకుర్తి, మే 4 : కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కల్వకుర్తి మండల పరిధిలోని కుర్మిద్ద, ఎల్లికట్ల, గుండూరు గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు మల్లు రవికి ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆయా గ్రామాల్లో జరిగిన ప్రచారంలో కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అశోక్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్‌రావు, భూపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ దామోదర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి మండల అధ్యక్షుడు బీస బాలరాజు, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి పలస జంగయ్యగౌడ్, కుర్మిద్ద గ్రామ కమిటీ అధ్యక్షుడు బల్మూరు కృష్ణయ్యగౌడ్, నాయకులు పుట్ట శేఖర్, రాకేష్, భూపాల్‌రెడ్డి, లింగయ్య, వినోద్, శివకుమార్, సిద్దు, శ్రీను, వెంకటేశ్, వాసుదేవ్, చందు, వెంకటయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భైరాపూర్‌లో ..

వెల్దండ, మే 4 : మండల పరిధిలోని భైరాపూర్ గ్రామంలో శనివారం పార్లమెంటు అభ్యర్థి మల్లురవి గెలుపుకై పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో తప్పక నెరవేరుస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మోతీలాల్, పీఏసీఎస్ డైరెక్టర్లు సంజీవ్‌కుమార్, వెంకటయ్య గౌడ్, నాయకులు భూపతిరెడ్డి, పర్వత్‌రెడ్డి, పుల్లయ్య, కృష్ణ ముదిరాజ్, హమీద్, తిరుపతిరెడ్డి, రాజుయాదవ్, శ్రీనుయాదవ్ తదితరులు ఉన్నారు.

కుడికిళ్లలో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

కొల్లాపూర్, మే 4 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవిని గెలిపించాలని కోరుతూ కొల్లాపూర్ మండల పరిధిలోని కుడికిళ్ల గ్రామంలో సింగిల్ విండో డైరెక్టర్ జూపల్లి రఘుపతిరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మీనుగ పరుశరామ్‌నాయుడుల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కుడికిళ్ల గ్రామ మాజీ సర్పంచ్‌లు ఊశన్న, మాజీ ఎంపీటీసీ శంకర్‌నాయుడు, నాయకులు రాము, మాజీ ఉప సర్పంచ్ బాలయ్య, పెద్దాపురం శ్రీనివాసులు, శ్రీరాములు, కుమ్మరి కుర్మయ్య, కల్యాణ్, అచ్యుతరావు, గొల్ల ఊశన్న, కురుమూర్తి, జీనుగపల్లి శ్రీరాములు, ఉదయ్, వెంకటస్వామి, హుసేన్, కావలి వెంకటయ్య, సూర్య తదితరులు పాల్గొన్నారు.

● ఉప్పునుంతల : మల్లురవికి మద్దుతుగా శనివారం ఉప్పునుంతలలోని గ్రామ శివారులో ఉపాధిహామి కూలీలను కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి మల్లురవికి ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి కూలీలను అభ్యర్థించారు. నాయకులు శ్రీనివాసులు, శ్రీను, రామచంద్రయ్య తిరుపతయ్య, మల్లయ్య, నాగరాజు ఉన్నారు.

దేవాలయ నిర్మాణానికి సహకరిస్తా

కల్వకుర్తి, మే 4 : కల్వకుర్తి మండల పరిధిలోని తర్నికల్ గ్రామంలో వీరనాగమ్మ దేవాలయ నిర్మాణానికి తనవంతు సహాయ సహకారాలందిస్తానని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ తెలిపారు. శనివారం పలువురు నాయకులు ఉప్పల వెంకటేశ్‌ను కలిసి దేవాలయ నిర్మాణానికి సహకరించాలని కోరగా ఆయన స్పందించారు. దేవాలయ నిర్మాణానికి సిమెంట్ అందజేస్తామని పేర్కొన్నారు. గతంలో గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో వంటగది నిర్మాణానికి ఉప్పల వెంకటేశ్ సిమెంట్ అందించారని వారు పేర్కొన్నారు. తర్నికల్ గ్రామస్తులు లింగోజీ, నాగేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

తిమ్మాజిపేట, మే 4: గ్రామాలల్లో మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పది శాఖలకు సంబంధించిన అధికారులు తమ నివేదికలను చదివి విన్పించారు. భగీరథ ద్వారా వచ్చే నీరు సరిపోవడం లేదని మండుతున్న ఎండల కారణంగా తాగునీటి సమస్యలు ఉన్నాయని ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని చేగుంట ఎంపీటీసీ కిల్లె మల్లయ్య అధికారులను కోరారు. రైతులకు కల్లాలు ఏర్పాటు చేస్తామని ఏడాది క్రితమే గ్రామానికి చెందిన ఓ కాంట్రాక్టర్ డబ్బులు తీసుకున్నాడని కల్లాల ఏర్పాటు చేయలేదని అట్టి డబ్బును వాపస్‌కూడా ఇవ్వడం లేదని అదే విధంగా పోతిరెడ్డిపల్లిలోను పనులు అసంపూర్తిగా ఉన్నాయని వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, ఎంపీటీసీ తిరుపతయ్యలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. జడ్పీటీసీ దయాకర్‌రెడ్డి, ఎంపీడీవో లక్ష్మీదేవి, ఎంఈవో శ్రీనివాసులు, విద్యుత్ ఏఈ సాయన్నగౌడ్, ఏపీఎం శ్రీహరి పాల్గొన్నారు.

కాంగ్రెస్ తరఫున ప్రచారం

మన్ననూర్, మే 4: నాగర్‌కర్నూలు పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లురవి తరఫున ఎన్నికల ప్రచారాన్ని జడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనూరాధ శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఇటీవల మన్ననూరు గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ మహిళా నాయకురాలు దశదిశ కర్మ కు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో ని పలు కాలనీల్లో ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవికి ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఓటర్లను ఓటు అభ్యర్థించారు. కోఆప్షన్ సభ్యుడు రహీం, ఎంపీటీసీలు దాసరి శ్రీనివాసులు, బాలమ్మ, కాంగ్రెస్ నాయకులు జూలూరి సత్యనారాయణ, సంభు వెంకట్‌రమణ, హన్మంత్‌రెడ్డి, బుచ్చయ్య, రమణగౌడ్, లోకనాథం, శివాజీ, రహమాన్ , రవూఫ్ , సంభు శోభ, జయమ్మ, ప్రభావతమ్మ పాల్గొన్నారు.

కుప్పగండ్లలో చలివేంద్రం ఏర్పాటు

వెల్దండ, మే 4 : మండల పరిధిలోని కుప్పగండ్ల గ్రామంలో శనివారం పీఏసీఎస్ డైరెక్టర్ మొక్తాల శేఖర్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇది ఎంతగానో ఉపకరిస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. శ్రీనివాస్‌యాదవ్, నర్సింహ, అల్లాజీ, లక్ష్మయ్య, గోరటి రాములు, వెంకటయ్యగౌడ్, యాదయ్య ఉన్నారు.